JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 15-12-2025
Medchal - Malkajgiri । Monday 15-12-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 199 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 199 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# ఆస్ట్రేలియాలో ఏమి జరిగింది?

- సిడ్నీ బీచ్ ఉగ్రదాడిని ఖండిస్తున్నాం..
- మరణించిన కుటుంబాలకు సంతాపం..
- ఉగ్రవాదాన్ని సహించేది లేదు.. ప్రధాని మోదీ



జయభేరి, న్యూఢిల్లీ:

ఆస్ట్రేలియాలోని సిడ్నీ బోండి బీచ్‌లో జరిగిన "భయానక ఉగ్రదాడిని" ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం తీవ్రంగా ఖండించారు. యూదుల పండుగ హనుక్కా వేడుకలు జరుగుతున్న సమయంలో ఇద్దరు దుండగులు కాల్పులు జరపగా, ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఎక్స్ (X) వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, ప్రాణనష్టం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ఆస్ట్రేలియాతో భారత్ సంఘీభావంగా నిలుస్తుందని తెలిపారు. "యూదుల పండుగ హనుక్కా తొలి రోజు వేడుకలు జరుపుకుంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని ఆస్ట్రేలియాలోని బోండి బీచ్‌లో జరిగిన భయానక ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న శూన్య సహన విధానాన్ని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు. "భారత ప్రజల తరపున, తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ విషాద సమయంలో ఆస్ట్రేలియా ప్రజలతో మేము సంఘీభావంగా ఉన్నాం. ఉగ్రవాదం అన్ని రూపాలు, అవతారాల పట్ల భారత్‌కు శూన్య సహనం ఉంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుంది" అని ఆయన అన్నారు. ఈ ఘటనను విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా తీవ్రంగా ఖండిస్తూ, ప్రాణనష్టంపై సంతాపం తెలిపారు. "ఆస్ట్రేలియాలోని బోండి బీచ్‌లో హనుక్కా వేడుకలపై జరిగిన

...మిగతాది 2 లో

# ఆ రోజు గీత దాటితే కొరడా..


- డిసెంబర్ 31 రాత్రి నుండి జనవరి 1 తెల్లవారుజామున జరుపుకునే వేడుకలు
- అధిక శబ్ద పరికరాలను రాత్రి 10 గంటల తర్వాత నిలిపివేయాలి
- సౌండ్ 45 డెసిబెల్స్ మించకూడదు
- తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే పోలీసులు కేసు నమోదు
- హైదరాబాద్ పోలీసుల స్ట్రిక్ట్ వార్నింగ్




జయభేరి, హైదరాబాద్ :

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో భద్రతకు సంబంధించి నగర పోలీసులు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. డిసెంబర్ 31 రాత్రి నుండి జనవరి 1 తెల్లవారుజామున జరుపుకునే వేడుకల కోసం త్రీ స్టార్, అంతకంటే ఎక్కువ స్థాయి ఉన్న హోటళ్లు, క్లబ్‌లు, బార్లు, రెస్టారెంట్లు/పబ్‌ల నిర్వాహకులకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. ఈవెంట్లను అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట వరకు నిర్వహించాలనుకునే యాజమాన్యాలు తప్పనిసరిగా ముందుగానే అనుమతి తీసుకోవాలి. కనీసం 15 రోజుల ముందుగానే హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ అమలు చట్టం 2013 ప్రకారం, నిర్వాహకులు ఎంట్రీ/ఎగ్జిట్, పార్కింగ్ స్థలాల్లో రికార్డింగ్ సదుపాయంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ నిర్వహణకు సెక్యూరిటీ గార్డ్‌లను నియమించాలి. ఈవెంట్లల్లో అశ్లీలత ఉండకూడదు. ఈ విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు సహించబోమని హైదరాబాద్ నగర

...మిగతాది 2 లో




# రైతులకు ప్రభుత్వం శుభవార్త


## వారికి యూరియా.. రైతు భరోసా

తెలంగాణ ప్రభుత్వం నిన్నటివరకూ గ్లోబల్ సమ్మిట్‌పై ఫోకస్ పెట్టింది. అది అయిపోవడంతో.. ఇప్పుడు ఇక అన్ని అంశాలపై దృష్టి పెడుతోంది. ముఖ్యంగా వ్యవసాయ శాఖ.. రైతులపై ఫోకస్ మొదలుపెట్టింది. తెలంగాణలో రైతులు.. ఇప్పుడు మామూలు రైతులు కాదు. వారు దేశాన్ని ముందుకు నడిపిస్తున్న మోడ్రన్ రైతులు. వారి టెక్నాలజీ, వారి వ్యవసాయ విధానాలు.. దేశం కంటే ముందున్నాయి. ఇక్కడి రైతులు ఏం చేసినా, అది సంచలనం అవుతోంది. ముఖ్యంగా వరి ఉత్పత్తిలో దూసుకుపోతున్నారు. అందువల్ల ఈ రైతులకు చేయాల్సిన కార్యక్రమాలను ఆలస్యం చేస్తే.. అది తెలంగాణకు మాత్రమే నెగెటివ్ అవ్వదు.. మొత్తం దేశానికే నెగెటివ్ అవుతుంది. కాబట్టి.. ప్రభుత్వం రైతుల సంక్షేమంపై ఫోకస్ పెడుతోంది.

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ అయిపోయింది. రబీ సీజన్ కూడా మొదలైంది. రైతులు ఆల్రెడీ పంటలు వేసేశారు. కొన్ని చోట్ల వేస్తూ ఉన్నారు. ఇలాంటి సమయంలో రైతులకు భారీగా యూరియా కావాల్సి ఉంటుంది. ఆల్రెడీ ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత బాగా కనిపించింది. రబీలో అలా జరగకుండా ఉండాలని ప్రభుత్వం ముందుగానే.. కేంద్రానికి లేఖలు రాసి.. రబీ సీజన్‌లో భారీగా యూరియా తెలంగాణకు దక్కేలా ప్రయత్నాలు చేసింది. అవి ఫలించడంతో.. రబీకి కావాల్సినంత యూరియా రెడీగా ఉందని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ అంచనా ప్రకారం.. జనవరి, ఫిబ్రవరి నెలల్లో యూరియా వాడకం బాగా పెరుగుతుంది. అప్పుడు రైతులు పెద్ద ఎత్తున యూరియా అడుగుతారు. అందుకే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ఇప్పటి నుంచే యూరియా అందుబాటులో ఉండేలా అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తున్నారు. భారీగా నిల్వలు పెట్టుకొని ఉంచాలనీ.. రైతులు అడగగానే ఇచ్చేలా చెయ్యాలనీ, ఎక్కడా లోటు రాకుండా చూడాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం.. కేంద్రాన్ని ఏం కోరిందంటే.. నెలకు 2 లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని కోరింది. ఇలా.. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ ఇవ్వాలని చెప్పింది. కేంద్రం కూడా ఆ ప్రకారమే ఇచ్చింది. అందువల్ల ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం దగ్గర 2.48 లక్షల టన్నుల ఎరువులున్నాయి. కానీ జనవరిలో డిమాండ్ పెరుగుతుంది కాబట్టి.. ప్రభుత్వం మరింత యూరియాని స్టాక్ పెట్టేందుకు రెడీ అయ్యింది. ప్రస్తుతం వివిధ రేవుల్లో 86వేల టన్నుల యూరియా ఉంది. అది కూడా తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం డిసెంబర్ కోటాలో భాగంగా ఇచ్చిందే. దాన్ని నెలాఖరుకల్లా.. తీసుకొస్తారు. ఓ అంచనా ప్రకారం.. డిసెంబర్ చివరి నాటికి తెలంగాణ ప్రభుత్వం దగ్గర 3 లక్షల టన్నుల దాకా యూరియా ఉంటుంది. అది జనవరికి సరిపోవచ్చు. అందువల్ల ఫిబ్రవరికి సంబంధించి జనవరిలో భారీగా తెప్పించే అవకాశాలు ఉంటాయి. అందువల్ల రబీ సీజన్‌లో యూరియాకి కొరత రాదు అని ప్రభుత్వం అంటోంది. మరోవైపు రైతుల్లో మాత్రం కొంత ఆందోళన ఉంది. ఖరీఫ్‌లో యూరియా కోసం రైతులు

...మిగతాది 2 లో



# సర్కార్ నిర్ణయం ఇదే..!

- వైజాగ్ లో అప్పుడే కాగ్నిజెంట్ ట్విస్ట్..!

జయభేరి, వైజాగ్ :

ఏపీలో ఐటీ సంస్థల్ని, పెట్టుబడుల్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఆయా సంస్థలకు వరంగా మారుతున్నాయి. ఓవైపు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి వస్తామంటూనే, మరోవైపు సవాలక్ష షరతులు పెడుతున్నాయి. అలాగే రాయితీలు కూడా కోరుతున్నాయి. ఇవన్నీ ఇచ్చాక కూడా తమ లక్ష్యాలు నెరవేరకపోతే కేటాయించిన భూములు రద్దు చేయొద్దంటూ ప్రభుత్వానికి షరతులు పెడుతున్నాయి. తాజాగా వైజాగ్ కు వచ్చిన కాగ్నిజెంట్ సంస్థ ఇదే చేసింది. విశాఖలో కాగ్నిజెంట్ ప్రస్తుతానికి ఓ తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసుకుంది. ఇందులో తమ కార్యకలాపాలు ప్రారంభించింది. అలాగే శాశ్వత కార్యాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకుంటే కాపులుప్పాడలో 22.19 ఎకరాలు కేటాయించింది.

...మిగతాది 2 లో

# అభివృద్ధి ఎక్కడా..?

- అస్తవ్యస్తంగా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ
- పారిశుద్ధ్యం, డ్రైనేజ్, సీసీ రోడ్లు పరిస్థితి అధ్వాన్నం
- పట్టించుకునే నాథుడే లేడా..?





యాదగిరిగుట్ట పట్టణంలోని చాలా చోట్ల చెత్తను ఎక్కడపడితే అక్కడే వేయడంతో డంపింగ్ యార్డ్ గా మారి దుర్వాస వస్తుందని, ఇళ్లు, కాలనీల్లో ఉండలేని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నుంచే ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. ప్రధాన రహదారి అయిన యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లే మార్గం పాతగుట్ట చౌరస్తాలో నిత్యం మురుగు నీరు,ఇళ్ల ముందు కడిన నీరు ప్రవహిస్తుండడంతో స్వామి వారి దర్శనానికి ఆ రోడ్డు గుండా వెళ్లే భక్తులు,స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రైతులకు ప్రభుత్వం శుభవార్త

పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. క్యూలైన్లలో చెప్పులు పెట్టుకోవాల్సిన పరిస్థితి కనిపించింది. రబీలో ఆ పరిస్థితి రాదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు రైతు భరోసా రెండో విడత డబ్బును ఎప్పుడు అకౌంట్లలో జమ చేస్తారనేది ఇంకా తేలలేదు. ప్రభుత్వం జమ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కానీ కచ్చితమైన తేదీని చెప్పట్లేదు. ఇటీవల ప్రభుత్వం మరిన్ని అప్పులు తీసుకునేందుకు అనుమతులు లభించాయి. అందువల్ల రైతులకు ఎకరానికి రూ.6,000 చొప్పున రైతు భరోసాని ఇచ్చేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పైగా రబీ సీజన్ కూడా ప్రారంభమైపోయింది కాబట్టి.. త్వరగా ఈ మనీ ఇవ్వకపోతే, రైతుల నుంచి ప్రభుత్వం ఆగ్రహాన్ని చూసే ప్రమాదం ఉంటుంది. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో తొలి విడతలో కాంగ్రెస్ ప్రభుత్వానికి.. రైతుల నుంచి వ్యతిరేకత కనిపించిందని బీఆర్ఎస్ అంటోంది. అందువల్ల కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు ఓడిపోయారని బీఆర్ఎస్ చెబుతోంది. అదే నిజమైతే.. రెండో విడతలో కూడా ఆ పరిస్థితి రావచ్చు. కానీ కాంగ్రెస్ మాత్రం.. ప్రజల మద్దతు తమకే ఉంది అంటోంది. అన్ని వర్గాల వారూ తమకే సపోర్ట్ చేస్తున్నారని అంటోంది. కానీ.. బీఆర్ఎస్ చెప్పిందే నిజమైతే.. రైతు భరోసా నిధులు త్వరగా విడుదల అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. ఇది పాత పథకమే కాబట్టి.. నిధులు విడుదల చెయ్యవచ్చు. కానీ కొందరు అధికారులు.. ఎన్నికల కోడ్ కారణంగానే రైతు భరోసా ఇంకా విడుదల కాలేదు అంటున్నారు. మరైతే.. మూడో విడత పోలింగ్ ఈ నెల 17న జరుగుతుంది. అదే రోజు ఎన్నికల కోడ్ ముగుస్తుంది. అందువల్ల 18 తర్వాత ఎప్పుడైనా రైతు భరోసా ఇచ్చే ఛాన్స్ ఉంటుంది. ప్రభుత్వం కచ్చితంగా ఇవ్వాలనే చూస్తోంది. కానీ ఎప్పుడు ఇస్తుందనేది తేలాల్సిన అంశం. త్వరగా ఈ నిధులు విడుదల చెయ్యాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అందువల్ల ఈ నెలలోనే రైతు భరోసా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## ఆస్ట్రేలియాలో ఏమి జరిగింది?

ఉగ్రదాడిని అత్యంత కఠినంగా ఖండిస్తున్నాను. బాధితులు, వారి కుటుంబాల పట్ల మా ఆలోచనలు ఉన్నాయి" అని ఆయన అన్నారు.

**ఆస్ట్రేలియాలో ఏమి జరిగింది?**

ఆదివారం సిడ్నీ బోండి బీచ్‌లో నిర్వహించిన యూదుల కార్యక్రమంలో ఇద్దరు దుండగులు కాల్పులు జరపగా కనీసం 11 మంది మృతి చెందారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపడంతో పాటు పాశ్చాత్య దేశాల్లో పెరుగుతున్న యూదు వ్యతిరేక భావజాలంపై (యాంటీసెమిటిజం) మళ్లీ దృష్టిని ఆకర్షించింది. కాల్పుల సమయంలో ఒక దుండగుడిని పోలీసులు కాల్చి చంపగా, మరో దుండగుడిని తీవ్ర గాయాల స్థితిలో అరెస్ట్ చేశారు.

ఈ ఘటనలో గాయపడిన మరో 29 మందిని అత్యవసర సిబ్బంది బీచ్ నుంచి వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ కాల్పులను పోలీసులు "ఉగ్రవాద ఘటన"గా ప్రకటించారు. మృతుడైన దుండగుడికి సంబంధించిన వాహనంలో అనుమానాస్పద "తాత్కాలిక పేలుడు పరికరాలు" లభ్యమైనట్లు వెల్లడించారు. మత, సాంస్కృతిక కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకున్న ఈ దాడి వెనుక ఉన్న భావజాల లేదా అతి వాద ప్రేరణలపై ఆస్ట్రేలియా కౌంటర్‌టెర్రరిజం బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని వర్గాలు సిఎన్ఎన్‌న్యూస్18కు తెలిపాయి. "ఈ దాడి సిడ్నీలోని యూదు సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగింది" అని రాష్ట్ర ప్రీమియర్ క్రిస్ మిన్స్ అన్నారు. ఈ ఉగ్రదాడితో తాను తీవ్రంగా కలత చెందానని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ ఆల్బనీజ్ చెప్పారు. "హనుక్కా తొలి రోజు ఆనందంగా, విశ్వాస వేడుకగా ఉండాల్సిన రోజున యూదు ఆస్ట్రేలియన్లను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఇది దుష్టకృత్యం. యూదు వ్యతిరేకత, ఉగ్రవాదం మన దేశ గుండెలపై దెబ్బకొట్టాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.

## ఆ రోజు గీత దాటితే కొరడా..

పోలీసులు తేల్చి చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లౌడ్‌స్పీకర్, డీజే సిస్టమ్, డీజే సౌండ్ మిక్సర్, సౌండ్ యాంప్లిఫైయర్, ఇతర అధిక శబ్ద పరికరాలను రాత్రి 10 గంటల తర్వాత నిలిపివేయాలి. ఇండోర్ ప్రాంగణాలైన కమ్యూనిటీ హాళ్లు, బ్యాంక్వెట్ హాళ్లు, ఫంక్షన్ హాళ్ల వంటి చోట్ల రాత్రి 10 గంటల తర్వాత కూడా సౌండ్ సిస్టమ్‌కు అనుమతి ఉంది. తెల్లవారుజామున ఒంటిగంట వరకు మాత్రమే వర్తిస్తుంది. సౌండ్ 45 డెసిబెల్స్ మించకూడదు. ప్రాంగణ సామర్థ్యానికి మించి పాసులు, టిక్కెట్లు, కూపన్లను జారీ చేయకూడదు. ఇది శాంతిభద్రతల సమస్యలకు దారితీయవచ్చని పోలీసులు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మైనర్లను అనుమతించకూడదు. డ్రగ్స్, నార్కోటిక్స్, సైకోట్రోపిక్ పదార్థాలను ఉపయోగించడానికి ఎవరినీ అనుమతించవద్దని నిర్వాహకులను కఠినంగా హెచ్చరించారు. ఈ విషయంలో యాజమాన్యం విఫలమైతే, అది వారి బాధ్యతేనని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ అనుమతించిన సమయానికి మించి మద్యం సరఫరా చేయకూడదు. మద్యం సేవించిన కస్టమర్లను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడానికి డ్రైవర్లు/క్యాబ్‌లను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత పబ్‌లు/బార్‌ల యాజమాన్యాలదే. వేడుకల్లో బాణసంచా వినియోగం పూర్తిగా నిషేధం. తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే పోలీసులు కేసు నమోదు చేస్తారు. మైనర్లు వాహనాలు నడపకూడదు, ఏదైనా ఉల్లంఘన లేదా మైనర్ వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగితే యజమానులే బాధ్యులవుతారు.

## సర్కార్ నిర్ణయం ఇదే..!

ఇక్కడ శాశ్వత కార్యాలయం నిర్మాణానికి సీఎం చంద్రబాబు తాజాగా శంఖుస్థాపన చేశారు. ఈ క్యాంపస్ ను 8వేల మంది ఉద్యోగులు పనిచేసేలా అత్యాధునిక వసతులతో నిర్మించాల్సి ఉంది. 2033 నాటికి 3 దశల్లో రూ.1,583 కోట్ల పెట్టుబడితో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ క్యాంపస్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఇందులో 2026 నాటికి మొదటి దశ నిర్మాణం పూర్తి చేసుకోనుంది. అయితే కాగ్నిజెంట్ తాజాగా భూమిపూజ సమయంలో ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేసింది. ఒప్పందం ప్రకారం తమ సంస్థ నిర్ణీత లక్ష్యాలను (క్యాంపస్ నిర్మాణం, ఉద్యోగాల కల్పన) గడువు లోపు అందుకోలేకపోతే ఏకపక్షంగా ఎంఓయూ రద్దు చేయకూడదని కోరింది. గడువులోపు నిర్మాణం పూర్తి కాక, ఉద్యోగాలు కల్పించలేకపోయినా అందుకు దారితీసిన పరిస్థితులు, కారణాలు తెలుసుకుని తుది నిర్ణయం తీసుకోవాలని, అలాగే ఏదైనా అంశంలో ప్రభుత్వానికీ, తమకూ ఏకాభిప్రాయం కుదరకపోతే మధ్యవర్తిత్వానికి వెళ్లేందుకు అనుమతి ఉండాలంటూ కోరింది. దీంతో ప్రభుత్వం కూడా చేసేది లేక అందుకు సమ్మతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రానికి వస్తున్న సంస్థల డిమాండ్లను తెరపైకి తెచ్చింది.

## కొండాపూర్ లో ఘనంగా నగర సంకీర్తన




✍ జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 14:

తుర్కపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో ఆదివారం భక్తమండలి గోధుమగుంట పోచయ్య ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు .ఈ సందర్భంగా గ్రామంలో భక్త బృందం హరే రామ నామ సంకీర్తనతో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నుండి గ్రామంలోని పురవీధులన్నీ తిరిగారు .ఈ కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

# కాషాయానికి కష్టం వచ్చింది..!

తెలంగాణలో బిజెపి పార్టీ గెలవక పోవడానికి కారణం ఏంటో..!? ఇంకా హిందూ మతానికి తామే పునాది వేసామంటూ ప్రచారం చేసుకోవడం లోపమా...!? ఎన్నికలు వచ్చినప్పుడు దేశభక్తి గురించి మాట్లాడడం అవివేకమ!? అసలు బిజెపి స్టాండ్ ఏంటో ప్రజల్లో పూర్తిగా అవగాహన వచ్చిందా..!? మూడుసార్లు కేంద్రంలో అధికారం దక్కించుకున్న బీజేపీ పార్టీకి, తెలంగాణలో చోటు లేకుండా పోతుంది ఎందుకు..!? నాయకుల సమన్వయ లోపమా..? గ్రామీణ ప్రాంతాల్లో పటుత్వం తగ్గిందనా!? ప్రధాని మోడీ బిజెపి తెలంగాణ నాయకులకు గట్టి చురక పెట్టారు. ఇకనైనా మారుతారా!? అధికారం దక్కించుకుంటారా..?

✍ జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ మూడవ స్థానానికి దిగజారి పోతుంది. దేశ రాజకీయాల్లో అగ్రస్థానంలో నిలిచి అధికారాన్ని మూడు సార్లు దక్కించుకున్న బిజెపి పార్టీ కేవలం సోషల్ మీడియాను నమ్ముకుని ఆర్ఎస్ఎస్ అండదండలు అందుకొని కొంత అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి మనందరికీ తెలిసిందే.. అంతేకాకుండా బీజేపీ పార్టీ అంటే హిందూ మతానికి బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న పార్టీగా ప్రజల్లో బలంగా ముద్ర పడిపోయింది. ఇది ఇలా ఉంటే తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో పూర్తిగా బిజెపి పార్టీకి అవకాశాలు లేకుండా పోతున్నాయి. ఇదే విషయంపై భారత ప్రధాని తెలంగాణ రాష్ట్ర బిజెపి ఎంపీ అభ్యర్థులు 8 మందితో గట్టిగా మందలించినట్టు సమాచారం. 2028 ఎన్నికల్లో కచ్చితంగా అధికారంలోకి బిజెపి పార్టీ తీసుకురావాలని కాస్త చురకలు కూడా అంటించారట..

**తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీకి వచ్చిన ముప్పు ఏంటి..!?**

తెలంగాణ రాష్ట్రంలో రెండుసారవచ్చిన బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన, మూడవసారి అనుకున్నట్టుగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ రెండు పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా తెలంగాణ రాష్ట్రంలో పోటీ పడుతుంటే బిజెపి పార్టీ అసలు సంబంధమే లేదు అన్నట్టుగా ఉండిపోవడంతో మొన్న జరిగిన ఉప ఎన్నిక బంజారాహిల్స్ లో పూర్తిగా బిజెపి పార్టీ డిపాజిట్ కూడా కోల్పోయింది. ఇదే విషయంపై మింగుడు పడని భారత ప్రధాని తెలంగాణ బిజెపి నేతలను గట్టిగా మందలించారు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో బిజెపి ఎంపీలు 8 మంది ఉన్నప్పటికీ కనీసం పార్టీ అధికారంలోనికి తీసుకురావడానికి కృషి చేయకపోవడం విడ్డూరంగా కనిపిస్తోంది. బిజెపి పార్టీ అంటే క్రమశిక్షణ కు మారుపేరుగా ఉంటుందని కార్యకర్తలు చెప్పుకుంటూ వచ్చిన అసలు క్రమశిక్షణ కొరవడిన పార్టీగా బిజెపి పార్టీ కనిపిస్తోంది. నాయకుల్లో సమన్వయం లేకపోవడం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పరిపాటిగా మారిపోతుంది. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి నాయకుల తీరు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా కొనసాగుతోంది.. ఒకవైపు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నప్పుడు యువతను ఆకర్షించేలా జై శ్రీరామ్ అంటూ నినాదాలతో కాస్త బిజెపిని ముందుకు నడిపించిన ఇప్పుడు మాత్రం కేంద్ర మంత్రిగా వచ్చిన తర్వాత బండి సంజయ్ మాట కూడా ఎవరూ లెక్క చేయకుండా ఉన్నట్టుగా కనిపిస్తోంది. రామ జన్మభూమి అయోధ్య దేశభక్తి హిందూ ఇజం ఇవన్నీ లేకపోతే అసలు బిజెపికి ప్రజల్లో స్థానం ఉందా అంటే అది ప్రశ్నార్థకమే..!?

రాముని యొక్క తలంబ్రాలు తీసుకొచ్చిన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అధికారాన్ని దక్కించుకోలేకపోతోంది బిజెపి ప్రభుత్వం. 8 మంది ఎంపీలు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన మరో ఇద్దరు ఎమ్మెల్సీలు బిజెపి పార్టీ తరఫున ఉన్న కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేని స్థితిలో తెలంగాణలో బిజెపి పార్టీ కుంటుతూ బతుకు ఈడుస్తోంది.. బిజెపికి కాలం చెల్లిపోయాయా అన్నట్టుగా జరుగుతున్న పంచాయతీ ఎలక్షన్లు మూడవ స్థానాల్లో బిజెపి పార్టీ సర్దుకుపోవడం పల్లెల్లో కూడా పట్టు లేకుండా పోతుంది. ఒకవైపు కాంగ్రెస్ ఇంకోవైపు బిఆర్ ఎస్ ఈ రెండు పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా రాజకీయ పోరు నడిపిస్తుంటే బిజెపి మాత్రం ఎనిమిది మంది ఎంపీలు ఉన్న కనీసం విజయం కోసం ఎలాంటి పథకాలు రచించకపోవడం కేవలం మతపరమైనటువంటి విషయాలను ప్రజల్లో రెచ్చగొట్టే మాటలను విసిరిన బిజెపి పార్టీని అంతగా పట్టించుకోలేదు. అంతేకాకుండా తెలంగాణ ప్రజలు బిజెపి నాయకులు మాట్లాడిన మాటలను కూడా అంత పెద్దగా విన్నట్టు కూడా కనిపించడం లేదు.



✍ కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

**తెలంగాణ రాష్ట్రంలో కాషాయానికి కష్టకాలం వచ్చిందా..!?**

నిజమే 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ బీజేపీ అధికారంలోకి తెలంగాణలో రాకపోవడం ప్రధానంగా నాయకుల సమన్వయ లోపం... తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించలేకపోవడం ఆ నాయకుల పనితీరుకు నిదర్శనం. అంతేకాదు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా దేశభక్తిని నూరిపోసే నాయకులు వీళ్లు అని ప్రజల్లో ముద్ర పడిపోవడం ప్రధానంగా వెనుకబాటుతనానికి నిదర్శనంగా కనిపిస్తోంది. అలానే జైశ్రీరామ్ అంటూ హిందూ మతానికి తామే పునాది వేశాం అంటూ చేసే ప్రకటనల్లోనూ ప్రజలు పెదవి విరుచుకుంటున్నారు. హిందూ మతాన్ని పూర్తిగా రాజకీయంలోకి తీసుకువచ్చి విచ్చిన్నం చేస్తున్నారు అని తెలపండిన హిందువులు కాస్త మనసు నొచ్చుకుంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ పల్లెలో బీజేపీ ఎక్కువగా ఖాతా తెరవకపోవడం పూర్తిగా తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తులో బిజెపి పార్టీ కనుమరుగయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇంకోవైపు భారత ప్రధానమంత్రి తిరుగులేని నాయకుడిగా మోడీ పరిపాలన కొనసాగిస్తుంటే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బిజెపి ఘన విజయం సాధిస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బిజెపికి పట్టు లేకుండా పోతుందనే బాధ ప్రధానమంత్రి మనసులో బలంగా నాటుకు పోయింది. అందుకే 2028 సార్వత్రిక ఎన్నికల్లో కచ్చితంగా సమయం ఉన్నందున ఇప్పటినుంచే బిజెపిని బలంగా పల్లెల్లో కార్యకర్తల్లోకి తీసుకువెళ్లాలని ప్రధానమంత్రి గట్టిగా వాతలు పెట్టారు..

ఇక ఇప్పటికైనా బిజెపి నేతలు తెలంగాణ పల్లెల్లో సంక్షేమం అభివృద్ధి గురించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని తమ పార్టీలోకి తీసుకునే విధంగా పార్టీ అలవాట్లను మార్చేసుకుంటూ ప్రజలకు ఏది మంచి ఏది చెడు ఆలోచించుకొని ప్రజల్లోకి వెళితే కానీ బిజెపి పార్టీ పల్లెల్లో పట్టు సాధించలేదు. అంతేకానీ కేవలం హిందూ మతాన్ని కేరాఫ్ అడ్రస్ గా పెట్టుకొని ఎన్నికలు వచ్చినప్పుడు దేశభక్తిని నూరిపోస్తూ యువతను రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ ఇంకా ఎంతకాలం అధికారాన్ని దక్కించుకుంటారు అని పల్లెల్లోని యువత ముఖ్యంగా చదువుకున్న యువత ప్రతి ఒక్కరిని ప్రశ్నించేలా ఓటు ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు.. ఇప్పటికైనా బీజేపీ నేతలు బుద్ధి మార్చుకొని రాష్ట్రంలోని ప్రజలకు ఏం కావాలి అని ఆలోచిస్తూ ముందుకు వెళితే గాని భవిష్యత్తులో బిజెపి పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో మనుగడ ఉండదు... దేశంలో బిజెపి పార్టీ తారస్థాయికి వెళుతున్న తెలంగాణలో మాత్రం మూడవ స్థానానికి దిగజారిపోవడం బిజెపి నేతలను కృంగదీస్తోంది. ఇక ఇదే విషయంపై కేంద్ర క్యాబినెట్ సీరియస్ గా తీసుకొని తెలంగాణ బిజెపి నాయకులను గట్టిగా మందలిస్తూ 2028 ఎన్నికల్లో ఎలాగైనా అధికారం దక్కించుకునే లాగా పథకాలు రచించాలని ఆదేశాలను జారీ చేసింది. ఇక తెలంగాణ రాష్ట్రంలోని బిజెపి నేతలు ఒకరికొకరికి సమన్వయం చేసుకుంటూ సీనియర్లను మర్యాదగా గౌరవించుకుంటూ కార్యకర్తల బాగోగులను చూసుకుంటూ ప్రజల మనసును తెలుసుకొని ఆ దిశగా రాజకీయ అడుగులు వేస్తే కానీ తెలంగాణ రాష్ట్రంలో కాసాయికి అధికారం దక్కదు....

## అభివృద్ధి ఎక్కడా..?

✍ జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 14:




తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారు కొలువైన యాదగిరిగుట్ట పట్టణ పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని మహాద్భుతంగా పునఃనిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్న గత, ప్రస్తుత ప్రభుత్వాలు యాదగిరిగుట్ట పట్టణాభివృద్ధిని మాత్రం పూర్తిగా విస్మరించాయి. యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని 12 వార్డులలోని అనేక సమస్యలు తిష్టవేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, డ్రైనేజీ,సీసీ రోడ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి.

ఒక వైపు మున్సిపల్ పాలకులు లేకపోవడం, మరోవైపు అధికారుల పాలనలో సరిగ్గా పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడిపోయింది. యాదగిరిగుట్ట పట్టణంలోని చాలా చోట్ల చెత్తను ఎక్కడపడితే అక్కడే వేయడంతో డంపింగ్ యార్డ్ మారి దుర్వాస వస్తుందని, ఇళ్లు, కాలనీల్లో ఉండలేని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నుంచే ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. ప్రధాన రహదారి అయిన యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లే మార్గం పాతగుట్ట చౌరస్తాలో నిత్యం మురుగు నీరు,ఇళ్ల ముందు కడిన నీరు ప్రవహిస్తుండడంతో స్వామి వారి దర్శనానికి ఆ రోడ్డు గుండా వెళ్లే భక్తులు,స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో వర్షం వస్తే కాలనీలన్నీ చిత్తడిగా మారుతాయి. పట్టణంలో నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద నీరు నిలిచి ఆ రోడ్డు గుండా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. యాదగిరిగుట్టలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇటీవల కొత్త వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. అందుకు అనుగుణంగా పైప్‌లైన్ పనులు పట్టణంలో కొనసాగుతున్నాయి. అయితే ఇక్కడే పెద్ద సమస్య వచ్చిపడింది. ఆ పైప్‌లైన్ కాంట్రాక్టర్ సీసీ రోడ్డు పక్కన కాకుండా మంచిగా ఉన్న రోడ్లను తవ్వి పైప్‌లైన్ వేస్తుండడంతో కాలనీలన్నీ దుమ్ము,మట్టితో నిండిపోయాయి. కొన్ని చోట్ల తవ్విన వాటిపై మట్టిపోసి వదిలేశారు. తప్పితే సిమెంట్ వేయకపోవడంతో ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే నామమాత్రంగా ఉన్న సీసీ రోడ్లు కొత్తగా చేసిన పైప్‌లైన్ పనులతో మరింత అధ్వాన్నంగా మారాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని అంగడిబజార్,బీసీ కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిని ఒక్కసారి చూస్తే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా స్పష్టమవుతుంది. పెద్ద మోరి పక్క నుంచి ఆ కాలనీలకు వెళ్లే రోడ్డును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొద్దిపాటి దూరం కూడా రోడ్డు వేయకపోవడం ఒకటైతే.. ఆ రోడ్డు పూర్తిగా గుంతలతో నిండిపోవడం మరొకటి. నిత్యం వందలాది మంది వెళ్లే రోడ్డుపై ధ్యాసలేదంటే అధికారులు ఏ మాత్రం పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పాలకులు లేరు మాకేంటి సంబంధం అన్నట్టు కాకుండా ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి సీసీ రోడ్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీతో పాటు మరిన్ని సమస్యలపై దృష్టిసారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని యాదగిరిగుట్ట పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థుల జయకేతనం

- బిఆర్ఎస్ విజయంతో గ్రామాలకు మహర్దశ
- నూతనంగా ఎన్నికైన నేతలను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- షాద్ నగర్ నియోజకవర్గంలో 65 స్థానాలను కైవసం చేసుకున్న గులాబీ జెండా
- కేసీఆర్ సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధిని విస్మరించని ఓటర్లు
- సర్పంచ్, ఉప సర్పంచులకు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘన సన్మానం



**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 14 :**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ నాయకత్వంలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయకేతనం ఎగరవేశారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ , సభ్యులను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ; గ్రామపంచాయతీ ఎన్నికల్లో గులాబీ పార్టీ తన ప్రభంజనాన్ని సృష్టించింది అన్నారు.

అధికార పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీని ఇచ్చిందన్నారు షాద్ నగర్ నియోజకవర్గంలో 153 గ్రామపంచాయతీ స్థానాలకు గాను 65 స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం సంతోషకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయంతో నాయకుల్లో కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహం నెలకొందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు తమదైన శైలిలో ప్రత్యర్థులను ఓడించేందుకు శ్రమించి ఉత్తమ ఫలితాలను సాధించారని అన్నారు. అధికార పార్టీకి బీఆర్ఎస్ గెలుపు గట్టి షాక్ ఇచ్చిందన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం అంటే బీఆర్ఎస్ పార్టీ అనే రీతిలో ఫలితాలను సాధించి గులాబీ పార్టీ తిరుగులేని శక్తిగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, పల్లె ప్రగతి ద్వారా జరిగిన అభివృద్ధిని గుర్తు చేసుకుని ప్రజలు బీఆర్ఎస్ వైపు నిలిచిందన్నారు. ఫరూఖ్ నగర్ మండలంలో 47 స్థానాలలో 18 మంది సర్పంచులుగా ఎన్నికై తమ సత్తాను చాటారు. కొందుర్గు మండలంలో 8, కొత్తూరు మండలంలో ముగ్గురు, నందిగామ మండలంలో 11 మంది, కేశంపేట మండలంలో 12 మంది, జిల్లేడు చౌదరిగూడ మండలంలో 13 మంది గులాబీ పార్టీ సర్పంచులుగా ఎన్నిక కావడం జరిగిందని, నియోజకవర్గంలో మొత్తంగా బీఆర్ఎస్ పార్టీకి 65 స్థానాలు వచ్చాయని అన్నారు.

రానున్న రోజుల్లో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని నూతన సర్పంచ్, ఉప సర్పంచులకు సూచించారు. గ్రామ అభివృద్ధి ప్రధాన ఎజెండగా ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటిన బీఆర్ఎస్ సర్పంచులను ఉపసర్పంచులను అభినందించి శాలువాతో సన్మానించారు.

# నారసింహుడి ఉచిత ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం



**జయభేరి, యాదగిరిగుట్ట:**

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తజనులతో కోలాహలం నెలకొంది. స్వయంభు క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్టలో కొలువై ఉన్న పంచనారసింహులను దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణోత్సవంలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తమ కుటుంబీకులతో పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఆంజనేయ స్వామిని కొలుస్తూ సహస్రనామాలు జరిపారు. కొండ కింద గల ఆధ్యాత్మికవాడలోని మండపంలో శ్రీ సత్య నారాయణ స్వామి వ్రతాలను చేపట్టారు.



అయితే యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ పెరగడంతో ఉచిత ప్రవేశ దర్శనానికి సుమారు 3 గంటల సమయం,ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంటన్నర సమయం పడుతోంది.



# సీపీఎం పార్టీకి బబ్బూరి పోశెట్టి రాజీనామా

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 14:**

సీపీఎం పార్టీ, యాదగిరిగుట్ట మండల కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు బబ్బూరి పోశెట్టి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అవలంభిస్తున్న విధానాలను వ్యతిరేకంగా పార్టీని వీడాల్సి వచ్చిందని తెలిపారు. సిపిఎం పార్టీ పూర్తికాలం కార్యకర్తగా,పార్టీ మండల కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాదాపు 40 ఏళ్లుగా సిపిఎం పార్టీ కోసం, ప్రజా ఉద్యమాలెన్నో నిర్వహించానని తెలిపారు.

# మానవత్వం చాటిన నోడల్ అధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్



**జయభేరి, గార్ల, డిసెంబర్ 14:**

మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తన వీధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ నోడల్ అధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మానవత్వాన్ని చాటారు.పోలింగ్ కేంద్రాలకు వచ్చిన నడవలేని వృద్ధాప్యంలో ఉన్న ఓటర్లను గేటు నుండి పోలింగ్ కేంద్రం వరకు విల్ చైర్ సహాయంతో తీసుకెళ్లి ఓటు వేయించి తిరిగి తమ గమ్యస్థానాన్ని చేరుకునేలా ఆటో ఎక్కించి పంపించారు. సేవా భావం చాటిన నోడల్ అధికారి తీరును చూసిన అక్కడి ప్రజలు,అధికారులు ఆయనను అభినందించారు.నిత్యం అనేక ప్రజా సేవా కార్యక్రమాల్లో నిమగ్నం అవుతూ ఉండటం చూసిన అక్కడి ఓటర్లు, అధికారులు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ ప్రశంసించారు.



# సర్పంచ్ అభ్యర్థి పేర్వాల రజిత జంగారెడ్డి ప్రచారం

**జయభేరి, డిండి :**

డిండి మండలం వావిల్ కోల్ సర్పంచ్ అభ్యర్థి పేర్వాల రజిత జంగారెడ్డి కి వావిల్ కోల్ వడ్డెర గూడెం రుద్రాయ గూడెం గ్రామ ప్రజలు ప్రజాసంఖ్యలో పాల్గొని జంగారెడ్డికి భారీ మెజారిటీతో గెలవాలని గ్రామ ప్రజలు భారీ ర్యాలీ లో పాల్గొన్నారు ర్యాలీలో ఓర్సు అంజయ్య, సత్తిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, దామోదర్ రెడ్డి,సురేష్, సుధాకర్ రావు, సోక్కయ్య, మోహన్ రెడ్డి, యాదవ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ను కలిసిన తుర్కపల్లి నూతన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 14 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో నూతనంగా గెలిచిన సర్పంచ్ సోమొల్ల వెంకటేశం ఆదివారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన సర్పంచ్ ప్రభుత్వ విప్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ వార్డు సభ్యులు, కవితా రాజమల్లు, అరవింద్, నాజీర్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.




# ఆక్రమణపై చర్యలకు వెనకడుతున్న రెవిన్యూ అధికారులు

- పరవాడ బిసి కాలనీలో ప్రభుత్వ పోరంబోకు భూమి అక్రమణపై చర్యలు చేపట్టాలి

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ గ్రామ బిసి కాలనీ అబ్జక్షన్ పోరంబోకు రెవెన్యూ సర్వే నెంబరు 8లో జరిగిన అక్రమా కట్టడాలుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.దీనిపై గతంలో స్థానిక ప్రజల ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు అప్పటి ఎంఆర్వో ఎస్ వి అంబేద్కర్ అబ్జెక్షన్ పోరంబోకు అని నోటీస్ ఇచ్చి అక్రమంగా నిర్మించిన గోడను తొలగించారు. దీనిపై సదరు అక్రమదారుడు కోర్టు ఉత్తర్వులను అడ్డంపెట్టుకొని పొజీషన్ చేంజింగ్ చేసి రెవెన్యూ అధికారులను,కోర్టు వారిని కూడా మోసగించి ప్రభుత్వ భూమిని కాజేయాలనే దురుద్దేశ్యంతో మరల అదే స్థలంలో అక్రమ నిర్మాణమును చేసారనీ దీనిపై గత కొన్ని రోజులుగా పలు పత్రికలలో ప్రచురణలు వస్తున్న అట్టి అక్రమ కట్టడంపై చర్యలు తీసుకొనుటకు ప్రభుత్వ భూమిని కాపాడుటలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారనీ ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వభూములను కాపాడవలసిన బాధ్యత రెవెన్యూ అధికారులు పై ఉందని దీనిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు,ప్రజా సంఘాలు చాలా విస్మయానికి గురవుతున్నాయి. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు దీనిపై స్పందించి భూమి అక్రమపై వస్తున్న ఆరోపణలపై సరి అయ్యిన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నూతనంగా గెలుపొందిన నాయకులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఘన సన్మానం



**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 14 :**

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామంలో ఉప సర్పంచ్ అప్పల సిద్ధయ్య, వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. నర్సప్పగూడ గ్రామ కంటెస్టెంట్ సర్పంచ్ గోవిందు కవిత కన్నప్ప సహకారంతో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ; గ్రామాభివృద్ధికి కలిసి పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతనంగా గెలుపొందిన నాయకులకు సూచించారు. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవాభావంతో పనిచేయాలని అందరితో కలిసి సమానత్వంతో అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గెలుపొందిన ప్రతి బిఆర్ఎస్ నాయకులకు తమ సాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగులపల్లిలో బీజేపీ విజయం మరో మైలు రాయి

- నాగులపల్లిలో బీజేపీ గెలుపు అభినందనీయం
- నాగులపల్లి డిప్యూటీ సర్పంచ్ కిరణ్ గౌడ్ ను సన్మానించిన మహబూబ్ నగర్ ఎంపీ డీ.కే అరుణ, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 14 :**

పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్నగర్ మండలం నాగులపల్లి గ్రామ 1వ వార్డు మెంబర్ అభ్యర్థిగా గడిగెల కిరణ్ గౌడ్ (సుమన్)పోటీ చేసి విజయం సాధించారు. విజయం సాధించిన కిరణ్ గౌడ్ (సుమన్)డిప్యూటీ సర్పంచ్ పదవికి ఎన్నికయ్యారు. ఈ గెలుపు ఒక మైలు రాయి బిజెపి గెలుపు పై ఎం.పీ అరుణ హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధికి సంబంధించిన అన్ని సహాయ సహకారాలు అందిస్తానని పాలమూరు ఎంపీ డీ.కే అరుణ, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.

# నిరుపేదలకు అండగా రాఘవేందర్ గౌడ్

- మేడ్చల్ పేదలకు దుప్పట్ల పంపిణీ



**జయభేరి, మేడ్చల్ :**

నిరుపేదలకు తోచిన రీతిన సాయం అందించడంలోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని మేడ్చల్ పట్టణం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి రాఘవేందర్ గౌడ్ తెలిపారు. ఆదివారం మేడ్చల్ పట్టణంలోని చలికి వణుకుతున్న నిరుపేదలు, వృద్ధులు, నిరాశ్రయులు, కూలీలు, యాచాకులకు మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి రాఘవేందర్ గౌడ్ దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో చలి అధికంగా ఉండటం వల్ల ఎంతో మంది నిరుపేదలు, వృద్ధులు, చలికి వణుకుతూ ఇబ్బందులు పడుతున్నారని గమనించి దుప్పట్ల పంపిణీ చేశానాని ఆయన తెలిపారు. నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ సమాజ సేవ చేస్తూనే ఉంటానని అన్నారు.




# వెంకీమామ వచ్చేశాడు

**ఆదర్శ కుటుంబంతో ఫ్యామిలీ ట్రీట్..!!**

ఓ వైపు ఫ్యామిలీ హీరోగా మన్ననలు అందుకుంటున్న విక్టరీ వెంకటేష్.. మరోవైపు మాటల మాంత్రికుడిగా పేరొందిన త్రివిక్రమ్ శ్రీనివాస్. ఈ కాంబో కలిస్తే ఆ బొమ్మ ఎంత క్రేజీగా ఉంటుందో తెలిసిపోతోంది. ఔను.. విక్టరీ వెంకటేష్ స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల కాంబినేషన్‌లో ఒక చిత్రం రాబోతోంది. ఈ సినిమా పేరు "ఆదర్శ కుటుంబం హౌజ్ నెం.47" షార్ట్‌గా AK 47. ఈ సినిమా పేరులోనే పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది.ఈ చిత్రానికి సంబంధించి వెంకీమామ ఫస్ట్ లుక్ విడుదలైంది. సినిమా షూటింగ్ డిసెంబర్ 10వ తేదీన లాంఛనంగా ప్రారంభమైంది. వెండితెరపై 'ఫ్యామిలీ హీరో'గా తెలుగు ప్రేక్షకులకు అత్యంత ఆప్తుడైన విక్టరీ వెంకటేష్, చాలా కాలం తర్వాత మళ్లీ అదే తరహా పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం' వేసవి 2026లో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది.ప్రతి కుటుంబం తమ కష్టసుఖాలను తెరపై చూసుకునేలా, ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే అనుభూతిని ఈ చిత్రం అందిస్తుందని చిత్ర బృందం హామీ ఇస్తోంది.వెంకటేష్‌ను మళ్లీ ఫ్యామిలీ ఓరియెంటెడ్ పాత్రలో చూడాలని ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది నిజంగా పండుగ లాంటి వార్తే. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హారికా & హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. కంటెంట్, నిర్మాణ విలువల్లో నాణ్యతకు మారుపేరైన ఈ సంస్థ నుంచి వస్తున్న ఈ చిత్రంపై సహజంగానే అంచనాలు భారీగా ఉన్నాయి. విడుదల ఎప్పుడంటే? 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని వేసవి కాలం 2026లో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. వేసవి సెలవుల్లో కుటుంబ ప్రేక్షకులందరినీ ఆకట్టుకునే లక్ష్యంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. గతంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ మాటలు అందించిన నువ్వు నాకు నచ్చావ్ చిత్రం ఎంతటి విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇక ఈ సినిమాలో కూడా వెంకటేష్‌తో కచ్చితంగా త్రివిక్రమ్ కామెడీ పండిస్తారని అభిమానులు ఎదురు చూస్తున్నారు. గతంలో వెంకటేష్ నటించిన పలు ఫ్యామిలీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. స్క్రీన్ పై తన ఎమోషన్స్ పండించి ఫ్యామిలీ లేడీస్ మనసుల్లో వెంకీ స్థానం సంపాదించుకున్నారు. ఇక ఈ చిత్రం పోస్టర్ చూస్తుంటే ... వెంకటేష్ మళ్లీ ఒక కామన్ మ్యాన్ క్యారెక్టర్‌లో ఆకట్టుకుంటారనే విషయం స్పష్టం అవుతోంది. వెంకటేష్ లాంటి నటుడు కుటుంబ బంధాలు, అనుబంధాలు ప్రధానంగా ఉండే చిత్రంలో నటించడం అంటే, ఆ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ తోడైనట్లే. 'ఆదర్శ కుటుంబం' టైటిల్‌లోనే ఎంతో సానుకూలత, వెచ్చదనం కనిపిస్తున్నాయి. 2026 వేసవిలో ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులందరికీ ఒక మధురమైన జ్ఞాపకాన్ని అందించబోతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం ఫస్ట్‌లుక్‌తోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా ఈ సినిమా పేరుతెచ్చుకుంది. మరి త్రివిక్రమ్‌వెంకటేష్ కాంబోలో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో 2026 వేసవి వరకు వేచిచూడక తప్పదు.

# చాంపియన్ హంగామా



రోషన్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'చాంపియన్'. అనస్వర రాజన్ కథానాయిక. ప్రదీప్ అద్వైతం దర్శకుడు. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 25న గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ప్రచారాన్ని వేగవంతం చేశారు. అందులో భాగంగా ఈ నెల 16న ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేయనున్నట్టు ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. ఈ క్రమంలో ట్రైలర్ అనౌన్స్‌మెంట్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ వీడియోలో రోషన్ నటన ఆకట్టుకున్నది. ఇప్పటికే విడుదలైన పాటలు చార్ట్ బస్టర్స్‌గా నిలిచాయని, ఈ నెల 16న విడుదల కానున్న ట్రైలర్.. ఈ సినిమాపై అంచనాలు మరింత పెంచుతుందని మేకర్స్ చెబుతున్నారు. నందమూరి కల్యాణ్‌చక్రవర్తి కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్ మధీ, సంగీతం: మిక్కీ జె.మేయర్, కళ: తోట తరణి, సమర్పణ: జీ స్టూడియోస్.



# కథతో జోడీ కడతా..

సీనియర్ హీరోల పాలిటి వరంగా మారారు కన్నడ కస్తూరి ఆషికా రంగనాథ్. 'నా సామిరంగ'లో అక్కినేని నాగార్జునకు జోడీగా ఆకట్టుకున్న ఆషికా.. 'విశ్వంభర'లో మెగాస్టార్‌తో కూడా కలిసి నటించారు. ఈ సినిమా సమ్మర్‌లో విడుదల కానుంది. ఆమె రాబోతున్న సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇందులో మరో సీనియర్ హీరో రవితేజతో జత కట్టారామె. తమ ఏజ్ గ్రూప్ హీరోలతోనే నటిస్తామంటూ చాలామంది హీరోయిన్లు పంతంపట్టి కూర్చుంటున్న నేటి తరుణంలో ఆషికా సీనియర్ హీరోయిన్ల పాలిటి వరంగా మారింది. ఈ విషయంపై ఇటీవల ఆమె మాట్లాడుతూ 'నాకు పాత్ర ముఖ్యం. మంచి కథ, అభినయానికి అవకాశం.. ఈ రెండూ ఉంటే కాంబినేషన్ల గురించి ఆలోచించను. నా దృష్టిలో ఏ సినిమాకైనా కథే హీరో. ఆ కథతో నేను జోడీ కడతా. అవకాశాలకోసం కథలో లేని పాత్రల్ని మాత్రం చేయను. చిరంజీవి, నాగార్జున, రవితేజ లాంటి లెజెండ్స్‌తో పనిచేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా.' అన్నారు ఆషికా రంగనాథ్.



# తల్లీకూతుళ్ల అనురాగం

జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో నటించిన కుటుంబ కథా చిత్రం 'విచిత్ర'. రవి రావణ్ రుద్ర, శ్రేయ తివారి, బేబీ శ్రీహర్షిణి, మీనావాసు ప్రత్యేక పాత్రధారులు. సైపుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. దర్శక,నిర్మాత సైపుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ 'తల్లీ, కూతుళ్ల అనురాగమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన సినిమా ఇది. తల్లిప్రేమ, త్యాగం, బంధం గురించి ఈ సినిమాలో చర్చించాం. ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకేలా ఈ చిత్ర కథ, కథనాలు సాగుతాయి. కొత్త సంవత్సరంలో సినిమాను విడుదల చేస్తాం.' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: నిజాని అంజన్, నిర్మాణం: సిస్ ఫిల్మ్స్.

# రజినీకాంత్ కోసం ఏడు రోజులు ఉపవాసం ఉన్న స్టార్ హీరోయిన్ ఎవరంటే..?

సూపర్ స్టార్ రజినీకాంత్.. కేవలం ఇండియాలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా ఈయనకు ఫ్యాన్స్ ఉన్నారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ ఇలా భాషతో సంబంధం లేకుండా అభిమానులు ఉన్నారు. ముఖ్యంగా జపాన్, థాయ్ లాండ్, బ్యాంకాక్ సహా పలు దేశాల్లో సూపర్ స్టార్ సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉంది. ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు ఈ స్టార్ హీరో. రీసెంట్ గానే లోకేష్ దర్శకత్వంలో కూలీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయింది. ఇక ప్రస్తుతం రజినీకాంత్ నటిస్తున్న చిత్రం జైలర్ 2. రెండేళ్ల క్రితం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం.. 600 కోట్లకు పైగా వసూలు చేసి సంచలనం సృష్టించింది. తెలుగులోనూ దాదాపు 90 కోట్ల వరకు గ్రాస్ వసూలు చేసింది. నెల్సన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో మోహన్ లాల్, శివరాజ్ కుమార్ స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చి అదరగొట్టారు. ఇప్పుడు ఈ సీక్వెల్ లో విజయ్ సేతుపతి, ఎస్.జె. సూర్య వంటి నటులు కూడా నటిస్తున్నారని సమాచారం. 2026 సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలని చూస్తున్నారు. కాగా ఏడు పదుల వయసులోనూ బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. డిసెంబర్ 12న ఆయన పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో సినీ ప్రముఖులు, ఫ్యాన్స్ బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. అయితే ఓ స్టార్ హీరోయిన్ ఒకప్పుడు రజినీకాంత్ కోసం ఏకంగా 7 రోజులు ఉపవాసం ఉన్నారట. దీంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. రజినీ శ్రీదేవి కాంబో.. అతిలోక సుందరి శ్రీదేవి.. తెలుగు, తమిళ, హిందీ సహా పలు భాషల్లో నటించి స్టార్ బ్యూటీగా ఎదిగారు. శ్రీదేవి చిన్న వయసులోనే నటనను ప్రారంభించి.. టాలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా ఎదిగారు. తెలుగులో ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, నాగార్జున వంటి లెజెండ్స్‌తో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీదేవి తెలుగులో నటించిన చివరి చిత్రం 'ఎస్.పి. పరశురాం' (1994). ఆ తర్వాత బాలీవుడ్‌లో 'జుదాయ్', 'లమ్హే', 'ఇంగ్లీష్ వింగ్లీష్', 'మామ్' వంటి చిత్రాలలో మెప్పించారు. స్క్రీన్ పైనే కాకుండా రియల్ లైఫ్ లో సినీ పరిశ్రమలో పలువురు స్టార్స్ స్నేహితులుగా కొనసాగారు. అందులో శ్రీదేవి, రజినీ సైతం మంచి స్నేహితులు అని అందరికీ తెలిసిందే. వీరిద్దరూ కలిసి దాదాపు 20 సినిమాల్లో నటించారు. అయితే ఒక సమయంలో రజినీకాంత్ అనారోగ్యంతో ఉన్నప్పుడు.. ఆయన కోసం శ్రీదేవి ఏడు రోజులు ఉపవాసం ఉన్నారట. ఈ విషయాన్ని వారి సన్నిహితులు ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టారు. ఇందుకు సంబంధించిన ఓల్డ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**